ఆమె చిలుకను ప్రేమగా ముద్దు పెట్టుకుంది.

"ఓ.కె.! సురేష్ రేపట్నుంచీ మీ వుద్యోగంలో రెండో ఘట్టం ప్రారంభమవుతుంది. మీరు అర్జున్‌ని అనుకరిస్తున్న విషయం కేవలం నలుగురు వ్యక్తులకే తెలుసు.

అర్జున్‌కీ, నాకూ, సహదేవ్‌కీ, విష్ణుకీ. మీరు వుండటం మా బిల్డింగ్‌లోనే. మీ బెడ్‌రూమ్ సపరేట్‌గా వుంటుంది. ఆఫీస్‌లో కూడా మీకు ఎలాంటి సమస్య వుండదు. ఇంతకాలం అర్జున్‌కి పర్సనల్ సెక్రటరీగా వున్న అమ్మాయిని తీసేసి మిస్ ప్రత్యూష అనే అమ్మాయిని ఎపాయింట్ చేశాము. ఆమె కొత్తగా జాయినయింది గనుక మీకూ, అర్జున్‌కీ ఏమయినా తేడా వున్నా కనిపెట్టలేదు. మీరు ఆఫీసులో విష్ణు చెప్పినట్లు చేస్తారు.... సంతకాలు చేయటం, బిజినెస్ వ్యవహారాలు మాట్లాడటం- అన్నీ విష్ణు గైడెన్స్ ఇస్తాడు...." మాట్లాడటం ఆపి సురేష్ కళ్ళలోకి చూసిందామె-"అర్థమయిందనుకుంటాను?"

అతను తలూపాడు.

"ఇందులో మీరు కష్టపడాల్సిందేమీ లేదు. అంతా అతి తేలిక! అయినా గానీ మీకు చాల ఎక్కువ డబ్బు ఇస్తున్నాం"

నిజంగా ఈ మాత్రానికే అయితే తనకిచ్చే డబ్బు చాల ఎక్కువే! కానీ ఇంతేకాదు దీని వెనక ఇంకేదో వుండి వుంటుంది. ఆమె లేచి నిలబడింది.

"రేపు ఉదయం ఎనిమిది గంటలకల్లా మీరు ఆఫీస్‌కి బయల్దేరాలి. ఆఫీస్‌లో మీ కోసం జర్నలిస్టులు, బిజినెస్ పీపుల్-చాలామంది కలుసుకుంటారు. ముఖ్యంగా ప్రభుత్వం ఇటీవలే మాకు లైసెన్స్ మంజూరు చేసిన N R I ప్రాజెక్ట్ విషయంలో మీరు చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. దాని విషయంలో ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఎన్నో విమర్శలు వచ్చాయ్ న్యూస్ పేపర్లలో-"

సురేష్‌కి ఠక్కున గుర్తొచ్చింది.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో తను చదివాడా న్యూస్. కొద్దిరోజుల పాటు ఓ కరస్పాండెంట్ ధారావాహికంగా ఆ వ్యవహారమంతా రచ్చకెక్కించాడు. దీనిని గెస్ చేసుకుని అసెంబ్లీలో పెద్ద గొడవయింది. అపోజిషన్ సభ్యులు ముఖ్యమంత్రి మీద ఎన్నో ఆరోపణలు చేశారు.

"మీరేం గాబరా పడనక్కర్లేదు. అన్నిటికీ విష్ణు సహాయం చేస్తాడు. మీ తరపున అతనే యాక్టివ్‌గా పాల్గొంటాడు అన్నిట్లో-"

ఆమె వెళ్ళిపోతూ తలుపు దగ్గర ఆగి అతని వైపు చూసింది మళ్ళీ.

"విష్ యూ గుడ్‌లక్...." అంది చిరునవ్వుతో.

అలా నవ్వుతూన్న ఆమెను చూస్తూంటే మతిపోతోంది. టెర్రిఫిక్ సెక్స్!

ఇదే మరొకప్పుడయితే...

“విష్ యూ గుడ్‌లక్” అంది చిలుక.

ఆమె చిలుకను ముద్దు పెట్టుకుంది. తలుపు మూసుకుంది ఆమె వెనుకే.

“చిలుకనయినా కాకపోతిని ఆమె పెదిమలు తాకగా-” పాట గుర్తుకొస్తోంది.

వి సి ఆర్ ఆన్ చేశాడు. అర్జున్ నడుస్తున్నాడు ఆఫీస్ గదిలోకి.

చాలా ఫాస్ట్‌గా నడుస్తున్నాడతను. అది ప్రాక్టీస్ చేయటం అంత కష్టమేమీ కాలేదు. కాలేజీలో తను ‘గాంధీ’ డ్రామా వేశాడు. గాంధీ నడకనూ, ఆయనలా మాట్లాడటాన్నీ, గెశ్చర్స్ అన్నీ 8 MM ప్రొజెక్షన్‌లో చూపించారు ప్రిన్సిపల్‌గారు.

అంచేత తేలికగా ప్రాక్టీస్ చేసి అద్భుతంగా అనుకరించగలిగాడు.

రాత్రి పది గంటలకు నిద్రపడుతూన్న సమయంలో విష్ణు గదిలో కొచ్చాడు.

“మనం యింకో అరగంటలో బయల్దేరుతున్నాం డ్రస్ చేసుకో!”

“ఎక్కడికి?”

విష్ణు చిరాగ్గా చూశాడు.

“సారీ!” అన్నాడు సురేష్. త్వరగా డ్రస్ చేసుకున్నాడు.

అద్దంముందు నిలబడ్డాడు రడీ అయ్యాక.

ఇప్పుడతను అర్జున్.

కె. యస్. అర్జున్! మన దేశంలోని అతి కొద్దిమంది కోటీశ్వరుల్లో ఒకరిని ముమ్మూర్తులా పోలి వున్నాడతను

చాలా ఎక్సయిటింగ్‌గా వుందతనికి.

తనకెదురుగ్గా అద్దంలో కె.యస్. అర్జున్!

సురేష్ నవ్వాడు. కె.యస్. అర్జున్ కూడా నవ్వాడు.

సురేష్ మస్తిష్కంలో మెరుపులా పాకింది ఆలోచన. అవును! తనకూ అర్జున్‌కీ ఏమిటి తేడా?

అతనికి కోట్లకొద్దీ ఆస్థి వుంది. తనకు లేదు! అంతే! అదొక్కటే తేడా. మిగతావన్నీ తనకూ వున్నాయి. అతని రూపం, అతనిలా సంతకం చేసే నేర్పూ, అతనిలా మాట్లాడటం, ప్రవర్తించటం, తను తల్చుకుంటే తల్చుకుంటే........

“కమాన్ సురేష్ ! ఎంతసేపు చూస్తావు అద్దంలో” విష్ణు తలుపు దగ్గరే నిలబడి పిలిచాడు.

అతనితోపాటు గదిలో నుంచి బయటికొచ్చాడు సురేష్. ఇన్ని రోజుల బందిఖానా తర్వాత బయటి ప్రపంచాన్ని చూడబోతున్నాడు తను. చిక్కటి ఆనందం కదిలించి వేసిందతనిని. లిఫ్టు కిందకు దిగుతోంది.

5-4-3-2-1 గ్రౌండ్‌ఫ్లోర్-అంటే తను ఆరో అంతస్తులో వున్నాడన్న మాట.

పోర్టికోలో కారు సిద్ధంగా వుంది.

స్టీమర్‌లా పొడుగ్గా వుందది. డ్రైవర్ బ్యాక్ డోర్ తెరచి పట్టుకున్నాడు.

ఇద్దరూ కార్లో కూర్చున్నారు.

కారు వేగంగా పరుగెడుతోంది. ఆ రోడ్డు తనెప్పుడూ చూడలేదు. అటూ ఇటూ అందమైన భవనాలతో ఇంద్రలోకంలా వుందా ప్రాంతం. కొండలమీద నుంచి పాకి చివరకు ఓ లోయలాంటి చోటకు దిగి ఆగింది కారు.

అది కూడా చాలా పెద్ద భవనమే! చుట్టూ విశాలమయిన గార్డెన్.

లిఫ్టులో సెకండ్‌ఫ్లోర్ చేరుకున్నారు. విశాలమయిన గదిలోకి అడుగు పెడుతూనే ఠక్కున ఆగిపోయాడతను. గుండె వేగంగా కొట్టుకోసాగింది.

ఎదురుగా సోఫాలో కూర్చుని వున్నాడు అర్జున్. కె.యన్. అర్జున్ ప్లాస్టిక్ సర్జరీ చేశాక తన ముఖం ఎలా వుందో అచ్చం అలాగే-

పక్కనే కూర్చుని వుందామె-చిరునవ్వుతో  తనవంక చూస్తూ...మరోవైపు సహదేవ్.

"కమాన్-కమాన్ మిస్టర్ సురేష్ " ఆహ్వానించాడు అర్జున్.

సురేష్ తేరుకుని ముందుకి నడిచాడు.

"కూర్చో!"

అతను అర్జున్ కెదురుగ్గా కూర్చున్నాడు. అర్జున్ అతనివంకే పరీక్షగా చూస్తున్నాడు.

సహదేవ్ అర్జున్ ముఖం వైపు ఆత్రుతగా చూస్తున్నాడు.

"ఫైన్ జాబ్ సహదేవ్!" అన్నాడు అర్జున్ కొద్ది నిమిషాల తరువాత.

"రేపట్నుంచీ ఆఫీస్‌కి పంపిస్తున్నాం సర్."

"ఓ.కె.!" విష్ణుకి సైగ చేస్తూ అన్నాడతను.

"కమాన్ సురేష్ ! వెళ్దాం పద" అన్నాడు అతని సైగను అర్థం చేసుకుని.

ఇద్దరూ ఆ గదిలోంచి బయటికొచ్చాక దాని నానుకునే వున్న మరో గది తలుపు తెరిచాడు.

సురేష్ ఆ గదిలోకి నడిచాడు. డెకొలాం ఫర్నిచర్, ఫోమ్‌బెడ్స్, నేలమీద తివాచీలు రంగుల కర్టెన్స్‌తో వెలిగిపోతోంది గది.

"ఇంక విశ్రాంతి తీసుకోవచ్చు సురేష్! ఏం కావాలన్నా నేను బయటే వుంటాను" అన్నాడు విష్ణు.

"మీకో విషయం చెప్పాలి...." అన్నాడు అతను.

"ఏమిటది?"

"నన్ను సురేష్ అని పిలవటం మానెయ్యటం మంచిది. రేపు ఇంకెవరి ఎదురుగ్గా నయినా

సరే ఇలాగే పిలిస్తే కథంతా బయటికొస్తుంది.”

విష్ణు తెల్లబోయాడు. అతని భయంకరమైన మొహంలో కళ వచ్చింది.

“ఫరవాలేదు మీకు తెలివుంది” అన్నాడు నవ్వుతూ.

“అవసరం విష్ణూ! లేకపోతే కెరీర్ రూయిన్ అయిపోతుంది. ఉద్యోగం కాస్తా పోతుంది.”

“గుడ్‌నైట్” అంటూ తలుపు వేసుకుని బయటికెళ్ళాడతను.

సురేష్ త్వరగా బట్టలు మార్చుకుని పడుకున్నాడు. అరగంట గడిచినా నిద్రపట్టటం లేదు.

యువతి రూపమే కళ్ళముందు కదులుతోంది. ఎంత అందంగా వుందామె.

26-20-22 సందేహం లేదు.

హఠాత్తుగా తులసి గుర్తుకొచ్చిందతనికి. మనసంతా అదోలా అయిపోయింది. ఏం చేస్తుండుంటూందా బ్యూటిఫుల్ గాళ్? తను చెప్పకుండా పారిపోయినందుకు ఎంతో మండిపడుతుంటుందా? పోలీస్ రిపోర్టు ఇచ్చివుంటుందా? లేక తనే ఉత్తరం రాస్తాడని ఎదురుచూస్తుంటుందా? ఆరు నెలలయ్యాక తను ఇంటి కెళితే ఏం జరుగుతుంది? తనే సురేష్ అంటే ఎలా నమ్ముతుంది? దిగాలుపడిపోయాడతను.

ఒకటే సంతృప్తి ప్రస్తుతానికి....తులసి ఆర్థికంగా ఎలాంటి బాధలూపడదు. అదే తను సాధించిన గొప్ప విజయం.

*   *   *   *   *

మర్నాడు ఉదయం విష్ణు నిద్ర లేపుతుంటే మెలకువ వచ్చింది.

“కమాన్ హరియప్! ఇవాల్టి నుంచీ ఉద్యోగంలో ప్రవేశిస్తున్నావ్”

సురేష్ గుండె కొద్దిసేపు వేగంగా కొట్టుకుంది. ఏదో భయం.... ఇవాళే ఏదో జరగబోతోంది తనకు. సిక్త్‌సెన్స్ చెప్తోంది. ఏదీ  లేకపోతే పది లక్షలు ఇవ్వటానికి వాళ్ళు వాజమ్మలు కారు.

మరో గంటలో కార్లో కూర్చున్నాడతను. ముందుసీట్లో విష్ణు. కారు శరవేగంతో పోతోంది. ఇండస్ట్రియల్ ఏరియా కొచ్చేసింది.

“మాధురీ ఇండస్ట్రీస్” ప్రహరీగోడ మొదలయింది. లోపల ఎన్నో పరిశ్రమలు. గేటు దగ్గర తుపాకులతో వున్న సెక్యూరిటీ గార్డ్స్ సెల్యూట్ కొట్టారు. కారు ఆఫీస్ భవనం దగ్గర ఆగింది. సురేష్ కారు దిగాడు. చాలమంది ఫుల్‌సూట్‌ల్లో వేచి వున్నారు. అందరూ నమస్కారాలు చేశారతనికి.

అతను చిరునవ్వుతో ప్రతి నమస్కారం చేశాడు.

“మాకు చాలా సంతోషంగా వుంది సార్....త్వరగా మీ ఆరోగ్యం కోలుకున్నందుకు.”

అతను చేయి వూపి లిఫ్టు దగ్గరకు నడిచాడు విష్ణుతో.

విష్ణు కోటు లోపల్నుంచి రివాల్వర్ అస్పష్టంగా కనబడుతోంది.

విష్ణు వెంబడే ఓ గదిలోకి నడిచాడతను.

చాల విశాలమయిన ఛాంబర్ అది. సినిమాల్లో సెట్టింగ్‌లా మనోహరంగా కనబడుతోంది. వలయాకారంగా వున్న పెద్ద టేబుల్, వెనుక కుషన్డ్ రివాల్వింగ్ కుర్చీ, ముందు వలయాకారంలో పది కుర్చీలూ, గోడలు దగ్గర సోఫాలూ, కింద మెత్తని తివాచీ, ఈ పక్క క్రోటన్స్ మొక్కలూ, గోడకు పెయింటింగ్స్, టేబుల్ మీద ఫోను బ్లూ కలర్‌లో సరికొత్త షేప్‌లో కొత్తగా మెరిసిపోతుంది.

“మీ యాక్షన్ చాలా బావుంది మిస్టర్ సురేష్ ! రియల్ అర్జున్ లాగున్నావు. స్టేజీ మీద చాలా అనుభవం వుండి వుండాలి.”

“ప్లీజ్! మీ అలవాటు మార్చుకోండి, నా పేరు అర్జున్ ఇక్కడ...”